telugurekhamedia.com
TELUGU REKHA TELUGU DAILY

# తెలుగు రేఖ

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 322 పేజీలు : 4 వెల : రూ. 2.00

ఆదివారం 22 ఫిబ్రవరి 2026 తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ RNI No.TELTEL/2010/31853

## మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి

**జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మంత్రి సీతక్క**

**హైదరాబాద్,ఫిబ్రవరి21( తెలుగురేఖ):**
మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క అన్నారు. వారిని ఆర్థికంగా స్థితిమంతులుగా చేయడానికి ఇందిరా


2 లో..




## ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే

- అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్
- కారిడార్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21 తెలుగురేఖ:**
ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ–ఘజియాబాద్–మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు



మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 2 లో..

# అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి



- డిసిసి అధ్యక్ష పదవి ఎదిగేందుకు తొలిమెట్టు
- కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి
- ఎవ్వరికైనా మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశం
- భిన్నాభిప్రాయాలు పార్టీ కార్యకర్తల స్థయిర్యాన్ని దెబ్బతీస్తాయి
- డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

**వికారాబాద్,ఫిబ్రవరి 21 తెలుగురేఖ:**
భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు.రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని 2 లో..




## రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలు వెంటనే స్పందించారు
- పత్తి కొనుగోళ్లు ఈ నెలాఖరు వరకు కొనసాగుతాయి
- పత్తి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావువెల్లడి



2 లో..

**హైదరాబాద్,ఫిబ్రవరి21 తెలుగురేఖ:**
రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు.

## గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

- కనీసం ఈ ఏడాదిలోనైనా 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి
- పేదల సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి



**హైదరాబాద్,ఫిబ్రవరి21 తెలుగురేఖ:**
తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014–23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని 2 లో..

## దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

- ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం
- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక

2 లో..



## అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

- దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,ఫిబ్రవరి21 తెలుగురేఖ:**
కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం 2 లో..



## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- తెలంగాణ మీడియా అకాడమి ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి21 తెలుగురేఖ:**
జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ మీడియా అకాడమి కట్టుబడి ఉందని ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారంనాడు తెలంగాణ మీడియా అకాడమిలోని కాన్ఫరెన్సు హాలులో 2వ పాలకమండలి సమావేశం ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని 8 జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, వివిధ అంశాలపై 7 వర్క్ షాప్ లు, 12 మంది సీనియర్ జర్నలిస్టులు చేసిన సేవలను రాబోయే తరాలకు తెలియపర్చాలనే ఉద్దేశ్యంతో వారి జీవితాలపై మోనోగ్రాఫ్స్ ముద్రించినట్లు ఆయన 2 లో..



## అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉండే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎం రేవంత్‌దే బాధ్యత
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక

**కామారెడ్డి,ఫిబ్రవరి21 తెలుగురేఖ:**
కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ 2 లో..



# పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం

- పాతవస్తువులు ఇస్తే నిత్యాసవర వస్తువులు ఇస్తున్నాం
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా బాధ్యతే
- స్వచ్ఛాంద్ర-స్వర్ణాంధ్రతో చెత్త ఏరివేత చేపట్టాం
- వినుకొండ సభలో సిఎం చంద్రబాబు వెల్లడి

**పల్నాడు,ఫిబ్రవరి 21 తెలుగురేఖ:**
గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు అన్నారు. మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి ఒకసారి గ్రామానికి స్వచ్ఛరథం వస్తుందని చెప్పారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన ' స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ప్రజావేదిక వద్ద స్టాళ్లను పరిశీలించారు. స్వచ్ఛ రథం




వచ్చినప్పుడు పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు మీకు ఆదాయం వస్తుందని చంద్రబాబు అన్నారు. సరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. పరిశుభ్రత కోసం మనమంతా కంకణబద్ధులం కావాలన్నారు. 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగుతున్నాయి. పచ్చదనం– పరిశుభ్రత, నీరు–మీరుతో ప్రజల వద్దకు వస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. నేను సీఎంగా వచ్చేనాటికి 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. 2 లో..

## పసి పిల్లలపై లైంగిక దాడులు

- 33 మంది బాలలకు నరకం చూపిన దంపతులు
- మరణశిక్ష విధించిన సిబిఐ కోర్టు

**లక్నో,ఫిబ్రవరి21 తెలుగురేఖ:**
అభంశుభం తెలియని పసి పిల్లలపై కొందరు మానవ మృగాలు లైంగిక వేధింపులకు పాల్పడ్డ కేసులో దంపతులకుమరణశిక్ష పడింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి కోర్టులు సైతం కఠిన శిక్షలు విధిస్తున్నాయి. తాజాగా ఇలాంటి ఓ కేసు విషయంలో దంపతులకు మరణశిక్ష పడింది. పదేళ్లలో 33 మంది బాలురపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆ దృశ్యాలను చిత్రీకరించి విదేశాలకు పంపించిన ఈ నరరూప రాక్షస దంపతులకు సరైన శిక్షపడింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రామ్ భవాన్.. చిత్రకూట్ జిల్లాలో గతంలో నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో తన భార్య దుర్గావతితో కలిసి 2010–2020 మధ్య.. బందా, చిత్రకూట్ ప్రాంతాల్లో బాలురపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. వీరి 2 లో..



## పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం

దానిని క్రమంగా తొలగిస్తున్నాం. వర్షాలు పడినప్పుడు భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీళ్లు తాగితే డయేరియా వంటి అనేక సమస్యలు వస్తాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం అని వివరించారు. ప్రతి నెల మూడో శనివారం ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరువుతున్నా. మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను వంద శాతం సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది. రాబోయే రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' హిట్ అయ్యింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద మొదటి తేదీనే ఇంటింటికి వస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తున్నాం. ప్రతి ఎకరాకు నీళ్లిస్తున్నాం అన్నారు. గిట్టుబాటు వచ్చే పంటలు వేయిస్తున్నాం. రైతులకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. అగ్రికల్చర్ నిపుణులను అందుబాటులో ఉంచుతున్నాం. రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం తదితర కార్యక్రమాలను నేనే ప్రారంభించానని వివరించారు. వారసత్వంగా వచ్చే పంటలే పండిస్తే ఆదాయం లేకుండా ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రూ.5కే భోజనం పెడుతున్నాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. ఆదాయం పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం అని అన్నారు. కొత్త విషయాలు నేర్చుకునేందుకు ముందుంటా. ఆదాయానికి చిరునామాగా మన రాష్ట్రం ఉండాలి. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. దిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌కు కాంగ్రెస్ వాళ్లు ఆటంకం కలిగించారు. నిన్న దిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల వైఖరి చూసి చాలా బాధపడ్డా. దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని చంద్రబాబు అన్నారు.

## అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం 12 గంటల పాటే విద్యుత్ సరఫరా ఇస్తున్నారని, ఎరువులు సకాలంలో అందడం లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతల సమస్యలను త్వరలో జరిగే రాష్ట్ర బ్జడెట్ సమావేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, ట్రాక్టర్లు సబ్సిడీకి ఇచ్చే విధంగా బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## పసి పిల్లలపై లైంగిక దాడులు

దారుణాలకు బలైన వారిలో మూడేళ్ల వయసు చిన్నారులు కూడా ఉన్నారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, బహుమతులు, తినుబండారాల పేరుతో పిల్లలను మభ్యపెట్టి ఇంటికి రప్పించి ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఈ దంపతుల దారుణాలకు సంబంధించిన 2 లక్షల వీడియోలు, ఫొటోలను ఇంటర్నెట్ ద్వారా 47 దేశాలకు పంపించారు. నిందితులపై సీబీఐ 2020 అక్టోబరులో కేసు నమోదు చేసింది. మైనర్ బాధితుల పట్ల సీబీఐ దర్యాప్తు సున్నితంగానే కొనసాగింది. రామ్ భవాన్, అతడి భార్యపై 2021 ఫిబ్రవరిలో సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ దంపతుల నుంచి ప్రాణాలతో బయటపడిన పిల్లల్లో కొందరి ప్రైవేట్ భాగాలపై గాయాలు అయ్యాయని, వారిలో కొందరు ఏళ్ల తరబడి ఆసుపత్రులలో చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఐదేళ్ల పాటు యూపీలోని పోక్సో కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. తాజాగా కోర్టు తుది తీర్పును వెల్లడించింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా పోక్సో కోర్టు అభివర్ణించింది. ఈ కేసులో నిందితులైన మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. అలానే బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే

58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విడతల వారీగా 120 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, 5 సంవత్సరాల కాల పరిమితితో నెలకు 3 వేల రూపాయల పెన్షన్ సదుపాయం కల్పించినట్లు ఆయన వివరించారు. అదే విధంగా అనారోగ్యం, ప్రమాదాలకు గురైన 19 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేశామన్నారు. అకాడమి భవన నిర్వహణలో భాగంగా 250 మంది సీటింగ్ కెపాసిటీ గల ఆడిటోరియం అ÷-దదెకు ఇవ్వడానికి సమావేశంలో చర్చించగా కమిటీ సభ్యులు తమ ఆమోదం తెలుపడం పట్ల కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్నింగ్ కౌన్సిల్ సభ్యులు మీడియా అకాడమి భవన నిర్వహణలో భాగంగా ఆడిటోరియం అద్దెకు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేస్తునే ఈ విధానం పూర్తిగా ఆన్ లైన్ విధానం ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా మీడియా అకాడమి వెబ్ సైట్లో ఆయా తేదీలు, సమయ పాలనని పొందుపర్చాలని సూచించారు. అప్పుడే పూర్తి పారదర్శకత చేకూరుతుందని వారు వెల్లడించారు. అందుకోసం ప్రభుత్వ ఆధీనంలోని రవీంద్రభారతి, జె.ఎన్.టి.యూ., సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయాకు సంబంధించిన విధి, విధానాలను అధ్యయనం చేసి అ÷-దదెకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని మీడియా అకాడమి కార్యదర్శికి సూచించారు. ఈ పాలక మండలి సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ సతీష్ కుమార్ తల్లాడి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ ఇంచార్జి హెడ్ డా. సునిల్ కుమార్ పోతన, దూరదర్శన్ కేంద్ర ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీమతి ఎ. చాందిని, ఆల్ ఇండియా రేడియే ప్రోగ్రామ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. రమేష్ సుంకసారి, స్పెషల్ గెస్ట్ వీర నారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ బి.వి. కృష్ణాజీరావు, తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

**గౌహతి,ఫిబ్రవరి21 తెలుగురేఖ:**

నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు. రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి

మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మహిళా సాధికారతలో తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని ఆవిష్కరించారు. 46.68 లక్షల మంది మహిళలు 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. గడిచిన రెండేండ్లలో మహిళా సంఘాలకు రూ.35.435 కోట్ల బ్యాంకింగ్ రుణాల మంజూరు చేశామన్నారు. ఇందిరా మహిళా శక్తితో 2.05 లక్షల సూక్ష్మ వ్యాపారాలను మహిళా సంఘాలు స్థాపించాయని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాలకు రూ.3.5 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. వారికి స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ఆర్టీసీ అ÷-దదె బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. జీడీపీలో మన దేశ మహిళల భాగస్వామ్యం 18 శాతమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40 శాతంగా ఉందన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు.

# అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి

సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడ న్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకుల ను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్లి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు

# రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కోనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతులకు సమయానికి ఎరువుల పంపిణీకి తమ సర్కారు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంతో పాటు అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, నాణ్యమైన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందనే భయం రైతుల్లో ఉన్న నేపథ్యంలో, మరో 30 రోజులు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి తుమ్మల సీసీఐను ప్రత్యేకంగా కోరారు. రాష్ట్రంలోని ప్రతి పత్తి రైతు తన పంటను పూర్తిగా విక్రయించే వరకు కొనుగోలు కేంద్రాలను తెరిచి ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సీసీఐ సీఎండీ శ్రీ లలిత్ కుమార్ గుప్తా మరియు కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్‌లకు మంత్రి ఆదేశాలతో వ్యవసాయశాఖ సెక్రటరీ లేఖ రాశారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనుగోళ్ల గడువు పొడిగించడంతో రైతులకు ఉపశమనం లభించిందని మంత్రి తెలిపారు. పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకొని రైతులు సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చి మద్దతు ధరకు విక్రయించుకోవాలని మంత్రి కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజురు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజురు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్ల క్రితం రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వచ్చే మూడు సంవత్సరాలలో రాష్ట్రం లో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 1.0లో భాగస్వామ్యం కాలేదు. అయితే 2023 తరువాత మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం 2.0 లో రాష్ట్రం అధికారికంగా చేరింది. 2024 ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం 2.0కు ఆమోదం తెలిపి, ఆవాస్-?2018 సర్వే నవీకరణ తర్వాత సాచురేషన్ పద్ధతిలో గృహాల మంజూరు చేయాలని నిర్ణయించినప్పటికీ, పాత డేటా ఆధారంగా 2024-25 మరియు 2025-26 సంవత్సరాలకు ఇతర రాష్ట్రాలకు 1.19 కోట్ల గృహాలను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం ఖఓఉజ 1.0 లో భాగస్వామ్యం కాకపోవడంతో 2018 పెండింగ్ డాటా లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్దిదారుల డేటాబేస్‌ను సిద్ధం చేసుకుంది. అయినప్పటికీ, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్?2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లను మజూరు చేయాలని' మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు. 263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో ఒక్క ఇంచు తేడా వచ్చిన రాజీనామా చేస్తానన్నారు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు తెలుసన్నారు.

ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిని రణరంగంగా మార్చారని ఫైర్ అయ్యారు. తనను చంపుతామని బెదిరించారని..ఇవాళ ఆ పనిచేశారని ఆరోపించారు. తాను పిలిస్తే వేలమంది రోడ్లమీదకు వచ్చేవాళ్లు.. అపుడు పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు వెంకటరమణా రెడ్డి. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. రేపటి నుంచి గ్రామాల్లో తిరుగుతా. ఇక యుద్ధ వాతారణమేనని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు. తనపై ఏం జరిగినా ప్రభుత్వానిది, సీఎందే బాధ్యత అనిచెప్పారు. ఇవాళ కారు బోల్తా పడింది రేపు మీ ప్రభుత్వం కూడా బోల్తా పడుతుందన్నారు. తమ కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో తన నిజాయితీ నిరూపించుకునేదాక ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో ఏది జరిగిన భరించా ఇక నుంచి భరించే ప్రసక్తే లేదన్నారు.

## ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన సర్ ప్రక్రియ

**- గుజరాత్‌లో 68 లక్షల 12 వేల 711 ఓట్ల తొలగింపు**

**- వవరాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి21 తెలుగురేఖ:**

ఆరు రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయింది. ఆ వివరాలను ఎన్నికల కమిషన్ శనివారంనాడు విడుదల చేసింది. రివిజన్ పక్రియలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో అనర్హత కలిగిన ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల కంటే గుజరాత్‌లో అత్యధికంగా ఓటర్ల తొలగింపు చోటుచేసుకుంది. రికార్డు స్థాయిలో 68 లక్షల 12 వేల 711 మందిని జాబితా నుంచి తొలగించింది. ఎస్ఐర్ పక్రియకు ముందు 5,08,43,436 మంది ఓటర్లు ఉండగా అది ప్రస్తుతం 4,40,30,725కు తగ్గింది. మధ్యప్రదేశ్‌లో 34,25,078 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. దీంతో ఓటర్ల సంఖ్య 5,74,06,143 నుంచి 5,39,81,065కు తగ్గింది. తర రాష్ట్రాల్లోనూ గణనీయంగా ఓటర్ల జాబితాలో సవరణలు చేటుచేసుకున్నాయి. రాజస్థాన్‌లో ఓటర్ల సంఖ్య 5,46,56,215 నుంచి 5,15,19,929 మందికి తగ్గింది. ఛత్తీస్‌గఢ్‌లో 2,12,30,737 నుంచి 1,87,30,914కు, కేరళలో 2,78,50,855 నుంచి 2,69,53,644కు తగ్గింది. గోవాలో ఓటర్ల సంఖ్య 11,85,034 నుంచి 10,57,566కు తగ్గింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌లో 52,364 మందిని జాబితా నుంచి తొలగించారు.

దీంతో ఓటర్ల సంఖ్య 3,10,404 నుంచి 2,58,040కి తగ్గింది. పుదుచ్చేరిలో ఓటర్ల సంఖ్య 10,21,578 నుంచి 9,44,211 మందికి, లక్షద్వీప్‌లో 57,813 నుంచి 57,607కు తగ్గింది. ఓటర్ల మరణం, శాశ్వతంగా నివాసస్థలాల మార్పు, పలుచోట్ల రిజిస్టర్ చేయించుకోవడం, ఇతర అనర్హత కారణాల వల్ల ఓటర్ల తొలగింపు జరిగిందని, కొత్త ఓటర్లకు జాబితాలో చోటు కల్పించామని ఈసీ తెలిపింది. ఎన్నికల జాబితా అప్‌డేట్ అనేది నిరంతర పక్రియ అని, అర్హత కలిగిన పౌరులు అప్లయ్ చేసుకోవడం, ఎంట్రీల కరెక్షన్ వంటివి చేసుకోవచ్చని పేర్కొంది.

# సంపాదకీయం..

## నయా నియంతృత్వంలో ట్రంప్

ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పుడు గుదిబండగా మారారు. ఆయన యుద్ధ పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది. అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్దాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్పు పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ పక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ.12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ.16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్‌కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. అయితే ఈ దశలో ట్రంప్ మొండివైఖరి కారణంగా అమెరికా పెత్తనం చెలాయించాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఏమైనా తనకు అక్కర్లేదన్న ధోరణి కనిపిస్తోంది.

## ప్రధాని నివాసం కోసం మురికివాడల ఖాళీ

**- ఇప్పటికే నోటీసులు ఇచ్చిన అధికారులు**

**- దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు జారీ**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి21( తెలుగురేఖ):**

దేశ రాజధాని న్యూఢిల్లీలో పరధాని నూతన నివాస నిర్మాణం.. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో మురికి వాడల్లో నివాసముంటున్న కుటుంబాలపై పడింది. అక్కడి నుంచి ఖాళీ చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ వారిని ఆదేశించింది. ఈ మేరకు వారికి నోటీసులు పంపింది. అక్కడి నుంచి ఖాళీ చేయకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చ రించింది. దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు అందాయని తెలుస్తున్నది. అయితే కచ్చితమైన గడువు తేదీని పేర్కొనకపోవడం, పునరావాసంపై ఎలాంటి స్పష్టతా లేకపోవడంతో అక్కడి స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని నూతన నివాసం నిర్మాణం నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నోటీసులు వచ్చినట్టు అంతా భావిస్తున్నారు. రేస్‌కోర్స్ రోడ్ వెంట ఉన్న భాయిరామ్ క్యాంప్, మస్జీద్ క్యాంప్, డిఐడి క్యాంప్ నివాసితులకు ఈ నోటీసులు అందినట్టు సమాచారం. నోటీసులో ఆ భూమిని ప్రభుత్వానికి చెందినదనీ, ఇకపై అక్కడ నివసించడం అనధికారికంగా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆదేశాలను పాటించకపోతే చట్ట ప్రకారం అక్కడి నుంచి తొలగింపు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. ఈ నోటీసుతో అక్కడి స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చాలా మంది నిరుపేదల అక్కడ నివసిస్తూ సమీప ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. ఖాళీ చేయాల్సిన గడువు, పునరావాసం, ప్రత్యామ్నాయాలపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని వారు అంటున్నారు. కాగా వారు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించి.. పునరావాసంపై స్పష్టత కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ఈ చర్యలు రాజధాని సెంట్రల్ జోన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే విస్తృత ప్రణాళికలో భాగమని అధికారులు తెలిపారు.

## మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!

**- అంతర్జాతీయ పరిణామాలతో పైపైకి..**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21( తెలుగురేఖ):**

దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం మరోసారి పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ. 1,57,380 వద్ద స్థిరపడింది. ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,44,260గా ఉంది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, శుక్రవారంతో పోలిస్తే 24 క్యారెట్ల బంగారంపై రూ. 880, 22 క్యారెట్లపై రూ. 800 మేర పెరిగింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,57,520 ఉండగా, ముంబైలో రూ. 1,57,370, చెన్నైలో రూ. 1,57,300గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, డాలర్ విలువలో మార్పులు, ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. ఈ కారణంగానే పసిడికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల సాధారణ వినియోగదారులపై, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేసే వారిపై ప్రభావం చూపనుంది.

## డిజైన్, ఆవిష్కరణ, బాధ్యతలు మూల స్తంభాలని స్పష్టం చేసిన ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ సదస్సు







**హైదరాబాద్, ఫిబ్రవరి 21, తెలుగురేఖ:**

హైదరాబాద్‌లోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) తన ప్రాంగణంలోని ఆడిటోరియంలో వైభవంగా నిర్వహించిన 5వ స్నాతకోత్సవ వేడుక విద్య గొప్పతనాన్ని ఘనంగా చాటింది. ఈ వేడుక 2025 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ విద్యా ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలిచింది. ఈ బ్యాచ్ విద్యార్థుల విజయాలను గుర్తించిన ఈ వేడుక... డిజైన్, ఫ్యాషన్, ఫుట్‌వేర్, రిటైల్, అనుబంధ రంగాల్లో వృత్తిపరమైన కెరీర్‌ల కోసం వారిని సిద్ధం చేసింది. ఈ వేడుకకు భారత ప్రభుత్వ బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన స్నాతకోత్సవ ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ... తయారీ, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రపంచంలో పెరుగుతున్న భారత్ ఆధిపత్యాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదక శక్తిగా ఉన్న పాదరక్షలు, తోలు రంగం లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తోందని... ఎగుమతులు, ఎమ్ఎస్ఎమ్ఈల వృద్ధికీ గణనీయంగా దోహదపడుతోందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ప్రపంచస్థాయి సామర్థ్యాలను బలోపేతం చేయడం కోసం సాంకేతికత, సుస్థిరత, డిజైన్ ఆవిష్కరణలను ఉపయోగించుకోవాలని ఆయన గ్రాడ్యుయేట్లను ప్రోత్సహించారు. ఎఫ్‌డీడీఐ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వివేక్ శర్మ (ఐఆర్ఎస్) ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన కోర్సు పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్లను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా సమర్థులైన నిపుణులను అభివృద్ధి చేయడం పట్ల సంస్థ నిబద్ధతను శ్రీ వివేక్ శర్మ స్పష్టం చేశారు. అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించడానికి ఆవిష్కరణలు, సుస్థిరత, నైతిక పద్ధతులు, వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించే ఆలోచనలను స్వీకరించాలని ఆయన విద్యార్థులను కోరారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్ రెడ్డి (ఐఏఎస్) స్వాగత ప్రసంగంతో ఈ వేడుక ప్రారంభమైంది. 2018లో హైదరాబాద్ క్యాంపస్ ఏర్పాటు నుంచి ఈ సంస్థ సాధించిన వేగవంతమైన వృద్ధిని ఆయన వివరించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఆధునిక ప్రయోగశాలలు, మెరుగైన పరిశ్రమ సహకారాలు వంటి కీలక విజయాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 2025 బ్యాచ్‌లో ఫ్యాషన్ డిజైన్, ఫుట్‌వేర్ డిజైన్, లెదర్ గూడ్స్-యాక్సెసరీస్ డిజైన్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు చెందిన 72 మంది గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఉన్నారు. ఈ వేడుకలో భాగంగా విద్యార్థుల విద్యా నైపుణ్యాన్ని గుర్తిస్తూ, ఆయా ప్రోగ్రామ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవ ప్రతిజ్ఞనూ నిర్వహించారు. ప్రముఖులు, అధ్యాపకులు, పరిశ్రమ భాగస్వాములు, గర్వంతో ఉప్పొంగుతున్న తల్లిదండ్రుల సమక్షంలో గ్రాడ్యుయేట్లకు అధికారికంగా డిగ్రీలను ప్రదానం చేశారు. నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, పరిశోధన, పరిశ్రమ ఏకీకరణ ద్వారా భారత పాదరక్షలు, తోలు, ఫ్యాషన్, రిటైల్ వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఎఫ్‌డీడీఐ కీలక పాత్ర పోషిస్తూనే ఉందని వక్తలు పేర్కొన్నారు. డిజైన్, తయారీలో సుస్థిర పద్ధతులను, ఔత్సాహిక పరిశ్రమలను, ప్రపంచస్థాయి ప్రమాణాలను ప్రోత్సహించడానికి ఈ సంస్థ కట్టుబడి ఉంది.

## ప్రధాని మోదీ రాజీపడ్డారు

**- 18 రోజు వేచి ఉంటే ఏకపక్ష ఒప్పందం**

**- ట్రేడ్ డీల్ ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21( తెలుగురేఖ):**

అమెరికా విధించిన సుంకాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన తర్వాత భారత్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికాతో ఏకపక్ష, భారత వ్యతిరేక వాణిజ్య ఒప్పందం చేసేందుకు కేంద్రం తొందరపడిందని ఆరోపించింది. తొందరపాటు అనేది దెయ్యం పని అని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేడా విమర్శలు గుప్పించారు. ఫిబ్రవరి 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, వాషింగ్టన్‌కు అర్ధరాత్రి ఫోన్ కాల్ ఎందుకు చేశారని నిలదీశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ గ్లోబల్ టారిఫ్‌లను రద్దు చేసింది. భారత్ మరో 18 రోజులు వేచి చూసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఫిబ్రవరి 2న వాషింగ్టన్‌కు అర్ధరాత్రి కాల్ ఎందుకు సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు ఎందుకు ఆగలేదు జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే ప్రకటనలే కారణమా జెఫ్రీ ఎఫ్‌స్టీన్ ఫైళ్ల ప్రభావమా గౌతమ్ అదానీకి సంబంధించిన అమెరికా క్రిమినల్ కేసా లేక ఇవన్నీ కారణాలా ఈ రోజు కాంగ్రెస్ వాదన సత్యమైంది. ప్రధాని నరేంద్ర మోదీ రాజీ పడ్డారు' అని పవన్ ఖేడా ఆరోపించారు. అమెరికాతో కుదిరిన ఏకపక్ష వాణిజ్య ఒప్పందాన్ని మోదీ ప్రభుత్వం పునఃసమీక్షించాలని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాల్ అన్నారు. అమెరికా కొత్తగా ప్రతిపాదించిన సుంకాల స్థిరత్వం, భారత్‌పై వాటి వర్తింపును ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. '1977లో అమల్లోకి వచ్చిన ఐఈఈపీఏ కింద అధ్యక్షుడికి టారిఫ్‌లు విధించే అధికారం లేదని అమెరికా సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122, 1962 ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్ సెక్షన్ 232, 1974 ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 కింద ట్రంప్ ప్రకటించిన కొత్త టారిఫ్‌లు భారత్‌కు వర్తించవని కనిపిస్తున్నాయి. ఇప్పుడు ప్రశ్న ఏంటంటే, ఈ సుంకాలు భారత్‌పై చట్టబద్ధంగా అమలవుతాయా అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం నిలబడుతుందా రైతులు, చిన్న, మధ్యతరహా వ్యాపారులు, ఇంధన, డేటా నిపుణులు, ఆర్థికవేత్తలు వ్యతిరేకిస్తున్న ఈ ఒప్పందం నుంచి బయటకు రావడానికి మోదీ ప్రభుత్వం ధైర్యం చేస్తుందా' అని సుర్జేవాలా ప్రశ్నించారు. సెక్షన్ 122 (ట్రేడ్ యాక్ట్, 1974) ప్రకారం 150 రోజులపాటు మాత్రమే 10శాతం టారిఫ్ విధించవచ్చని సుర్జేవాలా తెలిపారు. తరువాత అమెరికా కాంగ్రెస్ ఆమోదం అవసరమని, ఇది తాత్కాలిక చర్య మాత్రమే అని అన్నారు. ఇక సెక్షన్ 232 (ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్, 1962) -- జాతీయ భద్రతా కారణాలతో మాత్రమే టారిఫ్ విధించాలని పేర్కొన్నారు. 270 రోజుల్లో అమెరికా వాణిజ్య శాఖ సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని చెప్పారు. భారత ఎగుమతులు జాతీయ భద్రతకు ముప్పు కాదని వివరించారు. అలాగే సెక్షన్ 301 (ట్రేడ్ యాక్ట్, 1974) -- సంబంధిత దేశం అన్యాయ వాణిజ్య పద్ధతులు అనుసరించిందని దర్యాప్తు ద్వారా నిరూపించాలని చెప్పారు. భారత్‌పై అలాంటి దర్యాప్తు జరగలేదని ఆయన వివరించారు. ఇప్పుడు జాతీయ ప్రయోజనాలను రక్షించడానికి ప్రభుత్వం సిద్ధమా? అని సుర్జేవాలా ప్రశ్నించారు.ట్రంప్ సుంకాలను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ప్రశంసించారు. ట్రంప్ మొత్తం టారిఫ్ వ్యూహాన్ని కొట్టివేసిన అమెరికా సుప్రీంకోర్టుకు అభినందనలు తెలిపారు. కోర్టు భావజాల పరమైన నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుంటే 6-3 తీర్పు అద్భుతమైన, స్పష్టమైన నిర్ణయని పేర్కొన్నారు. అంతేకాకుండా. అమెరికా చెక్స్ అండ్ బాలెన్సెస్ వ్యవస్థ ఇంకా పనిచేస్తుందని చురకలేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.ఇదిలా ఉండగా, అమెరికా 10 శాతం గ్లోబల్ టారిఫ్‌ను అమలు చేసింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రకారం భారత్ కూడా ఈ టారిఫ్ చెల్లించాల్సి ఉంటుందని వైట్?హౌస్ స్పష్టం చేసింది. ఇక సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రపంచ వాణిజ్యం, వ్యాపార సంస్థలు, వినియోగదారులు, ద్రవ్యోల్బణ ధోరణులు, గృహ ఆర్థిక పరిస్థితులపై విస్తృత ప్రభావం చూపే అవకాశముంది.



# తిరుమలలో పెరిగిన రద్దీ

**- దర్శనానికి 18 నుంచి 20 గంటలు**

**- వేసవి రద్దీకి అనుగుణంగా టిటిడి ప్రణాళిక**

**తిరుమల,ఫిబ్రవరి21( తెలుగురేఖ):**

తిరుమల శ్రీవారి దర్శనానికి శనివారం యాత్రికులు పోటెత్తారు. దీంతో స్వామి వారి సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. కాగా శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. ఇదిలావుంటే త్వరలో ప్రారంభం కానున్న వేసవి సెలవులకు రానున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా చేపడుతున్నట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. గత రెండు,మూడు సంవత్సరాల వేసవి డేటాను విశ్లేషించి, దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను



మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అదనపు ఈవో తెలిపారు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి, గంటల వారీగా ఇన్?అవుట్ ఎ÷-లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా హేతుబద్ధంగా కంపా÷-టం÷-మెంట్లు, క్యూ లైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత వేసవిలో జూన్ నెలలో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించామని, అలాగే 2026 జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి పైగా దర్శనం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇది సమర్థవంతమైన టైమ్ మేనేజ్‌మెంట్, అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని వివరించారు. వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని అదనపు ఈవో ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# 1,100 ఫైల్స్ దగ్ధం ..

- డేటా రికవరీ చేయడం కష్టం
- కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ ఎంతో ముఖ్యం
- నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై ప్రత్యేక బృందం




**ములుగు, ఫిబ్రవరి 21( తెలుగురేఖ):**
నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు నాగ్‌పూర్ నుంచి వచ్చిన స్పెషల్ టీం గుర్తించింది. ఈ దగ్ధమైన ఫైల్స్‌లోని డేటా రికవరీ కోసం ఆ బృందం ఎంతో తీవ్రంగా ప్రయత్నించింది. తాజాగా ఈ ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది. ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో వెంట్రుకలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌ల విశ్లేషణ, రక్తం, వేలిముద్రలు, బుల్లెట్లు, లేదా డీఎన్ఏ నమూనాలు, ఆయుధాలు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా ప్రతీది ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్‌లోనే పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ ఆధారాలు ఎన్నో కోర్టు తీర్పుల్లో కీలకంగా ఉంటాయి. కానీ ఈ ప్రమాద ప్రభావం వల్ల కేసుల దర్యాప్తుపై ఎంత వరకు పడనుందనేది ఆందోళనకరమైన విషయం.

# ఆయేషా మీరా హత్య కేసు ముగింపు

- విజయవాడ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు
- అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగింత!
- ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు



**అమరావతి, ఫిబ్రవరి 21( తెలుగురేఖ):**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో విజయవాడలోని సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును ముగిస్తున్నట్లు ప్రకటించిన న్యాయస్థానం.. వైద్య బృందం సేకరించిన ఆయేషా భౌతిక అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని సీబీఐని ఆదేశించింది. ఫిబ్రవరి 27న తెనాలిలో ప్రభుత్వ భద్రత నడుమ మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయేషా హత్య కేసులో నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లభించలేదని సీబీఐ ఇటీవల కోర్టుకు తుది నివేదిక సమర్పించింది. ఈ నివేదికను తాజాగా న్యాయస్థానం ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండో సారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. ఈ క్రమంలో తమ కుమార్తె అవశేషాలను అంత్యక్రియల నిమిత్తం తమకు అప్పగించాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు షంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఫిబ్రవరి 27వ తేదీ తెనాలిలో అంత్యక్రియలు జరపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని సీబీఐ, రెవెన్యూ, పోలీసు అధికారులు, మత పెద్దల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అవశేషాల తరలింపునకు ప్రత్యేక వాహనం, ఎస్కార్ట్, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2007లో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని హాస్టల్‌లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.

# మీరే నాకు జీతం ఇస్తున్నారు సార్..

- సుందర్ పిచాయ్‌తో యూట్యూబర్ సరదా ముచ్చట



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21( తెలుగురేఖ):**
దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఓ యూట్యూబర్ కు సర్ ప్రైజ్ ఎదురైంది. ఏకంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ పక్కన కూచునే అవకాశం దక్కింది. తన సీటుకు రెండు సీట్ల అవతల ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన వ్యక్తి కూర్చోవడంతో ఆ యూట్యూబర్ సంతోషం మామూలుగా లేదు. తిన్నగా ఆయన వద్దకు వెళ్లి 'నమస్తే సార్.. మీరే నాకు నెలనెలా డబ్బులు ఇస్తున్నారు' అంటూ పలకరించాడు. దీనికి ఆశ్చర్యపోయిన సుందర్ పిచాయ్.. అదెలాగని ప్రశ్నించగా తానో యూట్యూబర్ నని, నెలనెలా యూట్యూబ్ నుంచి ఆదాయం పొందుతున్నానని చెప్పడంతో ఆయన కూడా నవ్వేశారు. అనంత్ లధా అనే యూట్యూబర్ కు ఎదురైందీ అనుభవం. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స వేదికగా పంచుకోవడంతో ఆ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చార్టర్డ్ అకౌంటెంట్ నుంచి యూట్యూబర్ గా మారిన అనంత్ లధా.. 'ఇన్వెస్ట్ ఆజ్ ఫర్ కల్' అనే ప్లాట్‌ఫారమ్ నడుపుతున్నారు. ఏఐ సదస్సులో సుందర్ పిచాయ్‌తో కలిసి దిగిన సెల్ఫీని షేర్ చేస్తూ తన 'ఫ్యాన్ బాయ్' మూమెంట్ గురించి ఎక్స్ లో పోస్ట్ చేశారు. సదస్సులో సుందర్ పిచాయ్ పక్కనే కూర్చునే అవకాశం రావడంతో అనంత్ ఆయనతో మాటలు కలిపానని చెప్పారు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు సుందర్ పిచాయ్ సింప్లిసిటీని మెచ్చుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. "బిజీ షెడ్యూల్ లోనూ సామాన్య వ్యక్తులతో ఆయన మాట్లాడే విధానం అద్భుతం" అని ఒకరు, "తర్వాతి వంతు జుకర్ బర్గ్ లేదా ఎలాన్ మస్క్ అనుకుంటా.. వారు కూడా మీకు డబ్బులు ఇస్తారుగా!" అంటూ మరొక నెటిజన్ చమత్కరించారు.

# మండలిలో ఫోటోలతో శ్రీవారికి అపచారం

- లడడూలో వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పింది
- లడ్డు గురించి మాట్లాడితే హెరిటేజ్‌ను ముందుకు తెచ్చారు
- తప్పు చేసిన ఎవ్వరినీ వదలబోనన్న సిఎం చంద్రబాబు



**పల్నాడు,ఫిబ్రవరి21( తెలుగురేఖ):**
చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామి ఫొటోలను మండలిలో వైకాపా సభ్యులు విసిరేశారని సిఎం చంద్రబాబు మండిపడ్డారు. శ్రీవారి విషయం బయట మాట్లాడకూడదని రెండు రోజులుగా ఆగానన్నారు. వేంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని.. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. ఏపీ శాసనమండలిలో వేంకటేశ్వర స్వామి ఫొటోలతో వైసీపీ సభ్యులు చేసిన నిరసనలపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ అంశంపై వినుకొండ సభలో సీఎం మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేశారని చెబితే హెరిటేజ్‌ను తెరపైకి తీసుకొచ్చారన్నారు. 'నేను ప్రాణం పోయినా తప్పు చేయను' అని స్పష్టం చేశారు. లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందన్నారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ÷ర్ అయ్యారు. తప్పును పక్క వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారన్నారు. అలాంటి కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయం చేయాలా అని విమర్శించారు. తాను కూడా జైలుకు వెళ్తానని ఊహించలేదని.. నోటీసు ఇస్తే సమాధానం చెప్పేవాడినని సీఎం చంద్రబాబు అన్నారు. 'నా ప్రాణం పోయినా పరవాలేదు... రాష్ట్రం కోసం పోరాడతాను' అని చెప్పుకొచ్చారు. చాలా మంది తాను జైల్లో నుంచి ప్రాణాలతో బయటకురారని అనుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మట్లాడుతున్నారని.. రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వివేకా హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని.. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవేదన కలిగించిందన్నారు. కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని తెలిపారు. దేశానికి మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

## నెలఖరు వరకు తెలంగాణలో పత్తి కొనుగోళ్లు

- ప్రభుత్వం విజ్ఞప్తితో సిసిఐ నిర్ణయం

**హైదరాబాద్,ఫిబ్రవరి21( తెలుగురేఖ):**
తెలంగాణలో ఈ నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు చేయనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తితో సీసీఐ నిర్ణయం తీసుకుంది. జాయింట్ సెక్రెటరీ, కేంద్ర జౌళిశాఖకి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి లేఖ రాశారు. పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మంత్రి తుమ్మల కోరారు. కేంద్ర ప్రభుత్వం, సీసీఐ నిర్ణయంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అయితే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో కూడా పత్తి రైతులకు ఊరట లభించింది. సీసీఐ సంస్థ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో సమస్యను ఎంపీ వంశీ దృష్టికి తీసుకెళ్లారు రైతులు. వెంటనే స్పందించిన ఎంపీ వంశీ.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా( సీసీఐ)తో మాట్లాడి ప్రొక్యూర్మెంట్ గడువును పొడిగించాలని కోరారు. రైతులకు సంబంధించిన పత్తి పంట ఇంకా పూర్తి దశలోకి చేరుకోలేదని.. ఇంకా పత్తి తీసే దశ ఉందని సీసీఐ దృష్టికి తీసుకెళ్లారు. పత్తి కొనుగోళ్ల పక్రియను మరికొన్ని రోజులు కొనసాగించాలని ఆయన కోరారు. ఎంపీ వంశీ లేఖకు స్పందించిన సీసీఐ సంస్థ మరో 7 రోజులు పత్తి కొనుగోళ్లు చేసుకోడానికి వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని నియోజకవర్గ రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ ఎంపీ వంశీ కోరారు. ఎంపీ వంశీ కృష్ణ చేసిన కృషికి హర్షం వ్యక్తం చేశారు స్థానిక రైతులు.

# దిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

- ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్
- నిఘా వర్గాల హెచ్చరికలు జారీ
- ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21( తెలుగురేఖ):**
దేశ రాజధాని దిల్లీలో మరోసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా(ౡమ) కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో దిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఎల్?ఈటీ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. చాందినీ చౌక్ ప్రాంతంలోని ఒక దేవాలయంపై ఐఈడీతో దాడి చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కేవలం దిల్లీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 12 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరోసారి ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడం దేశ రాజధానిలో కలకలం రేపుతోంది.

# అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు

- సుంకాలు వెంటనే అమల్లోకి..
- సుప్రీం తీర్పు తర్వాత ట్రంప్ ప్రకటన
- సుప్రీం తీర్పుపై ట్రంప్ తీవ్ర నిరాశ
- వాణిజ్య దిగ్బంధం విధిస్తానని హెచ్చరిక




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21( తెలుగురేఖ):**
ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వచ్చేలా ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వస్తాయని వైట్‌హౌస్ వెల్లడించింది. ఇవి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది. అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధించేందుకు ఓవల్ ఆఫీస్? నుంచి సంతకం చేయడం తనకు చాలా గౌరవంగా ఉందని ట్రూత్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇవి దాదాపు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ విషయంపై అందిరికి ధన్యవాదాలు అని రాసుకొచ్చారు. చట్టపరమైన మరో అధికారాన్ని అమలు చేసే వరకు ఈ కొత్త సుంకం అమల్లో ఉంటుందని వైట్ హౌస్ అధికారి ఒకరు పేర్కొన్నారు. వాణిజ్య భాగస్వాములు అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు ప్రకారం టారిఫ్?లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. భారత్ 10 శాతం టారిఫ్ చెల్లించాలా అలాగే ఇది గతంలో ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకానమీక్ పవర్ యాక్ట్(ఐఈఈపీఏ) కింద విధించిన టారిఫ్?లను భర్తీ చేస్తారా అని ప్రశ్నకు వైట్?హౌస్ అధికారి ఈ మేరకు స్పందించారు. ఈ 10 శాతం గ్లోబల్ టారిఫ్ అనేది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన రక్షణాత్మక వాణిజ్య విధానంలో భాగమని పేర్కొన్నారు. చెల్లింపుల సమతుల్యత లోటును తగ్గించడం, అన్యాయ వాణిజ్య విధానాలను పరిష్కరించే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న చమురు కొనుగోళ్లను భారత్ తన అభ్యర్థన మేరకు గణనీయంగా తగ్గించిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌తో తనకు అద్భుతమైన సంబంధం ఉందని తెలిపారు. వైట్‌హౌస్‌లో అమెరికా సుప్రీంకోర్టు తను విధించిన టారిఫ్‌లను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక భారత్‌తో ట్రేడ్ డీల్ కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొత్త చట్టపరమైన మార్గాల ద్వారా కొనసాగుతాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా, సుంకాలతో భారత్– పాక్ యుద్ధాన్ని పరిష్కరించినట్లు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. 'నేను పరిష్కరించిన 8 యుద్ధాల్లో 5 యుద్ధాలను టారిఫ్‌ల ద్వారా ముగించాను. మీకు నచ్చినా, నచ్చకపోయినా నేను 8 యుద్ధాలను ముగించాను. అందులో భారత్–పాకిస్థాన్ వంటి అణు యుద్ధానికి దారితీసే పెద్ద వివాదాలు కూడా ఉన్నాయి. గురువారం జరిగిన పీస్ బోర్డ్ సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి మాట్లాడుతూ, అధ్యక్షుడు ట్రంప్ జోక్యం వల్ల 3.5 కోట్ల ప్రాణాలు కాపాడారని అన్నారు. వారు చాలా ప్రమాదకర చర్యలకు సిద్ధమవుతున్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్–పాక్ ఘర్షణ సమయంలో 10 యుద్ధవిమానాలు కూల్చివేసినట్లు ట్రంప్ తెలిపారు. గురువారం 11 విమానాలు కూల్చివేశారని చెప్పిన ఆయన, ఇప్పుడు సంఖ్యను 10కి తగ్గించారు. ఆ యుద్ధం అణు యుద్ధానికి దారితీసేలా సాగుతోందని అన్నారు. దానిని టారిఫ్‌ల ద్వారానే ఆపినట్లు చెప్పారు. ఇరు దేశాలకు యుద్ధం చేయాలనుకుంటే చేయండని, కానీ అమెరికాతో వ్యాపారం చేయలేరు తేల్చి చెప్పాను. ప్రతి దేశంపై 200 శాతం టారిఫ్ విధిస్తాను హెచ్చరించాను. దీంతో ఇరుదేశాలు ఫోన్ చేసి విరమణ ఒప్పందానికి వచ్చినట్లు చెప్పారని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు తన పన్నుల విధింపు అధికారాన్ని కట్టడి చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన న్యాయవ్యవస్థపై ధ్వజమెత్తారు. ఈ తీర్పు దేశానికి తీరని అవమానమని, కొందరు న్యాయమూర్తులకు దేశం కోసం సరైన నిర్ణయం తీసుకునే ధైర్యం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా, ఈ తీర్పు వెనుక 'విదేశీ ప్రయోజనాలు' ఉన్నాయని, న్యాయమూర్తులు బయటి వ్యక్తుల ప్రభావానికి లోనయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తనను ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పాత చట్టం కింద వేసిన పన్నులను కోర్టు కొట్టివేస్తే, తక్షణమే 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. "నేను ఎంత పన్ను వేయాలనుకుంటే అంత వేస్తాను. పాత చట్టాల కంటే ఇప్పుడు మా దగ్గర ఉన్నవి చాలా శక్తిమంతమైనవి. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధిస్తాను, ఇతర దేశాల వాణిజ్యాన్ని దెబ్బతీసే అధికారం నాకుంది" అంటూ ఆయన తన దూకుడును ప్రదర్శించారు. సుంకాల విధింపు వల్ల అమెరికాలో పరిశ్రమలు కళకళలాడుతున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. జార్జియాలోని ఒక స్టీల్ ప్లాంట్ యజమాని తనను కలిసి "సార్, మిమ్మల్ని ముద్దు పెట్టుకోవాలని ఉంది" అని అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. విదేశీ వస్తువుల దిగుమతి ఆగిపోవడంతో అమెరికాలో నిరుద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్ 50 వేల మార్కును దాటిందని ఆయన గర్వంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పుతో గతంలో వసూలు చేసిన సుమారు 175 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఆ డబ్బును వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందా? అన్న ప్రశ్నకు.. "కోర్టు ఆ విషయం గురించి చర్చించలేదు, దీనిపై మరో ఐదేళ్ల పాటు కోర్టులో పోరాటం సాగుతుంది" అని ట్రంప్ దాటవేశారు.

# ప్రతి కుక్కకూ ఓ రోజు వస్తుంది

- ఎన్ని కేసులు పెట్టినా, చావనైనా చస్తాను
- ఎట్టిపరిస్థితుల్లో నేను తగ్గనే తగ్గను
- వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు



**అమరావతి, ఫిబ్రవరి 21( తెలుగురేఖ):**
వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రతి కుక్కకూ ఒక రోజొస్తుంది. ఈ రాంబాబు అనే కుక్కకు కూడా ఓ రోజు వస్తుంది. అప్పుడు తగ్గనే తగ్గను' అని ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన, బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. అనంతరం నిన్న గుంటూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశానికి ముందు, ఆయన తాడేపల్లిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. తనపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయించారని జగన్‌కు వివరించారు. దీనిపై స్పందించిన జగన్, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపోరాటం చేద్దామని భరోసా ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ, తాను ఆవేశంలో అన్న మాటలపై రియలైజ్ అయ్యానని తెలిపారు. జైలు జీవితాన్ని ఎంజాయ్ చేశానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. తన పోరాటం మాత్రం ఆగదని స్పష్టం చేశారు. 'ఎన్ని కేసులు పెట్టుకున్నా తగ్గను. చావనైనా చస్తాను గానీ, తగ్గే ప్రసక్తే లేదు' అని పేర్కొన్నారు.

Printed and Published by RAMANI WEB OFFSET PRINTERS, Published at 8-81/11/1, AUTONAGAR,village:BOMMAKAL, mandal& District:KARIMNAGAR-505001, RNI No. TEL-TEL/2010/31853, Editor: Eldi Ravinder, 9-10/7, KRISHN NAGAR,village:BOMMAKAL, mandal& District:KARIMNAGAR-505001telugurekha1984@gmail.com, 9963197573.